బాలకళా విలాసం

- కళా, క్రీడా రంగాలపై చిన్నారుల ఆసక్తి
- వేదికగా నిలుస్తున్న బాలభవన్
- వేసవి సెలవుల్లో ఉచితంగా శిక్షణ
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా నిర్వహణ



బాలభవన్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు

బోట్‌క్లబ్: నెలరోజుల క్రితం వరకూ తెల్లవారింది మొదలు తిరిగి పడుకునే వరకూ పుస్తకాలతో కుస్తీ పట్టి బ్యాగులు మోయలేక నడుమంతా సుస్తీతో ఇబ్బందులు పడ్డ చిన్నారులకు వేసవి సెలవులు వారిలో ఆనందాన్ని తెచ్చాయి. ఈ సెలవులకు పల్లెటూళ్లలో అమ్మమ్మ, నాన్నమ్మల ఇంటికి వెళ్లేందుకు కొందరు సిద్ధమైతే.. మరికొందరు చిన్నారులు వారి తల్లిదండ్రులు తమ కళా కౌశలానికి పదును పెట్టేందుకు సన్నద్ధమయ్యారు. కొందరు క్రీడల్లో, మరి కొందరు సంగీతంలో, ఇంకొందరు వివిధ కళల్లో ప్రతిభ చూపాలని ఉవ్విళ్లూరారు. ఆ మేరకు వారికి నచ్చిన అంశాలైన వయోలిన్ నేర్చుకోవడం, కొందరు మృదంగం తదితర వాద్య పరికరాల్లో శిక్షణ పొందుతున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న స్థానిక బాలభవన్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఉచితంగా నేర్చుకునే అవకాశం

కాకినాడలోని గాంధీనగర్ చిల్డ్రన్ పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఏటా వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను గత నెల 24వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ, సాయంత్రం 4.30 నుంచి 7.30 వరకూ నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో చేరేందుకు ఆరు నుంచి పదహారు సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గాత్రం, వయోలిన్, మృదంగం, కరాటే తదితర అంశాల్లో శిక్షణ ఇస్తుంటారు. విద్యార్థులు వారికి నచ్చిన ఆంశంలో నైపుణ్యం కలిగిన శిక్షకుల ఆధ్వర్యంలో సాధన చేసి ప్రావీణ్యం సాధించవచ్చు. ఈ సమయంలో చిన్నారులు ఎటువంటి రుసుములు చెల్లించవలసిన అవసరం లేదు. చిన్నారులకు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం, సంగీతం, వాయిద్య సంగీతం, కరాటే మొదలైన అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో ప్రతిభ వెలికి తీయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏటా బాలభవన్ తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

ఇక్కడ శిక్షణతో ఎంతో మేలు

చిన్నారుల అభిరుచికి తగిన విధంగా బాల భవన్‌లో ఉండే వాయిద్యాలతోనే నిత్యం శిక్షణ ఇస్తుంటారు. ఇందువల్ల వారిలో తోటి పిల్లలతో కలిసి గాత్ర సంగీతం, వాయిద్య సంగీతంతో పాటు, కరాటేలోనూ సులభంగా నేర్చుకునే అవకాశం ఉంది. అంతేకాదు తోటి విద్యార్థులతో కలిసి మెలిసి సఖ్యంగా ఉండటం తెలుస్తుంది. పైగా కరాటే, సంగీతం, వాయిద్య సంగీతంలో శిక్షణ పొందడం వలన శారీరక, మానసిక వికాసం కలుగుతుంది. తద్వారా చిన్నారులు చదువులో చురుగ్గా ఉంటున్నారని తల్లిదండ్రులు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.



మృదంగంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



వయోలిన్ సాధన చేస్తున్న చిన్నారులు

మృదంగం నేర్చుకుంటున్నాను



నాకు వాద్య సంగీతం అంటే ఇష్టం. అందువల్ల మృదంగం నేర్చుకోవాలనేది కోరిక అందుకోసం నాతల్లి గంగ ప్రోత్సాహంతో తొలిసారిగా వేసవి శిక్షణ శిబిరంలో బాలభవన్‌లో చేరాను. నాలాంటి ఎంతో మంది ఔత్సాహికులు వారికిష్టమైన సంగీతాన్ని నేర్చుకునేందుకు బాలభవన్‌లో అవకాశం ఉంది.

– పి.గౌరీ మహేష్

గాత్ర సంగీతం అంటే ఇష్టం



నేను బాలభవన్‌లో వేసవి శిక్షణ శిబిరంలో గాత్ర సంగీతం నేర్చుకునేందుకు చేరాను. గాత్ర సంగీతం అంటే ఇష్టమైనప్పటికీ పాఠశాలకు వెళ్లడంతో సమయం చాలక నేర్చుకోలేదు. వేసవి సెలవులు కావడంతో ఇక్కడ ఉచితంగా నేర్పించడంతో ఉదయం సాయంత్రం వేళ గాత్ర సంగీతం నేర్చుకుంటున్నాను. చదువుతో పాటు, సంగీతంలోనూ ప్రావీణ్యం సాధించాలనుకుంటున్నా. అందుకు బాలభవన్ నాలాంటి వారికి మంచి వేదికగా నిలుస్తుంది.

– జి. లాస్యజ్ఞాపిక

స్ట్రాంగ్‌రూమ్ నిరంతర పరిశీలన

జేసీ, పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ, పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదివారం కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమును సందర్శించి పరిశీలించారు. అక్కడ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూముకు పటిష్ట భద్రత కల్పించామన్నారు. అదే విధంగా స్ట్రాంగ్ రూము వద్ద అన్ని వైపులా కనిపించేలా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘాను పరిశీలించడం జరుగుతుందని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

ఏఎస్‌డీ కళాశాలలో ఉచిత శిక్షణ

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో డేటాఎంట్రీ, టైలరింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి ఆదివారం తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్మీడియట్, టైలరింగ్ కోర్సుకు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 63047 31843 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

వచ్చే నెల ఐదున దేవస్థానం భూముల కౌలు వేలం

కరప: స్థానిక శివాలయంలో దేవదాయశాఖకు చెందిన భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వచ్చేనెల ఐదో తేదీన ఉదయం 9 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ కె.తిరుమల రవితేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించి 7 ప్రతులుగా ఉన్న 19.67 ఎకరాలకు, విష్వాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేణుగోపాలస్వామివారి దేవస్థానానికి సంబంధించి ఏడు ప్రతులుగా ఉన్న 18.74 ఎకరాలకు విడివిడిగా (ఒక్కొక్క ప్రతికి) మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు సాగుచేసుకునే నిమిత్తం వేలంపాట నిర్వహించనున్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు ప్రథమ ధరావతుగా చెల్లించాలన్నారు. హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం శిస్తులో సగం సొమ్మును పాట కొట్టివేసిన వెంటనే చెల్లించాలన్నారు. పాట నిలిపివేతకు, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందన్నారు. మిగిలిన వివరాలకు దేవస్థానం సిబ్బందిని సంప్రదించాలని ఈఓ తిరుమల రవితేజ సూచించారు.

యువకుడి వైద్యానికి రూ.25 వేల సాయం



సాయికిరణ్‌కు చెక్కును అందజేస్తున్న శ్రీయువసేన అధ్యక్షుడు సతీష్

కాకినాడ సిటీ: నగరంలో 27వ వార్డుకు చెందిన 27 ఏళ్ల యువకుడు దోనె సాయికిరణ్ శస్త్ర చికిత్స నిమిత్తం స్థానిక శ్రీ యువసేన రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఆదివారం ఆ సంస్థ అధ్యక్షుడు సతీష్ అతడికి ఈ మొత్తాన్ని అతడికి అందజేశారు. సాయికిరణ్ తన సమస్యను శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి వివరిస్తూ బెంగళూరు నిమ్‌హాన్ హాస్పిటల్‌లో తనకు శస్త్ర చికిత్స చేయాలని కోరాడు. ఈ మేరకు అందిన సమాచారంతో వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు తమ సీఎస్సార్ నిధుల నుంచి ద్వారంపూడి వీరభద్రారెడ్డి సహకారంతో రూ.25 వేలను శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌కు అందించగా ఆ సొమ్మును సాయికిరణ్‌కు అందజేసినట్లు సతీష్ తెలిపారు.

కోర్సుల ఫీజులపై సూచనలివ్వండి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న బీటెక్, బీఈడీ, లా కోర్సులకు సంబంధించి ప్రైవేట్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కాలేజీలకు సంబంధించి ఫీజుల నిర్ధారణకు సంబంధించి సూచనలు, సలహాలు అందజేయాలని డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రిటైర్డ్ మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.కన్నమాల్ చైర్మన్‌గా ఇప్పటికే ఫీజు కమిటీ ఏర్పడిన నేపథ్యంలో త్వరలో ఫీజుల నిర్ధారణ జరుగుతుందన్నారు. ఈలోగా తల్లిదండ్రులు, పేరెంట్స్ అసోసియేషన్‌లు తమ సూచనలు, సలహాలను ఈ నెల 28లోగా 'డీహెచ్‌టీఈ ఎట్‌దిరైట్‌ఆఫ్ డీహెచ్‌పీడీవై.ఈడీయూ.ఇన్' ఈమెయిల్‌కు పంపాలని కోరారు.

సాయం చేయబోతే సెల్‌ఫోన్ చోరీ

సామర్లకోట: రోడ్డుపై పడిపోయి ఉన్న వ్యక్తికి చెయ్యి ఇచ్చి లేపడానికి ప్రయత్నం చేసే సమయంలో వెనుక నుంచి మరో వ్యక్తి చొక్కా జేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేసి ఉడాయించాడు. స్థానిక సత్యనారాయణపురంలో నివసిస్తున్న ఆర్‌ఎంపీ డాక్టరు ఇనకోట సురేష్ తన ఇంటి సమీపంలో అనారోగ్యానికి గురైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేసి మోటారు సైకిలుపై శనివారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయి ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తి చెయ్యివ్వమని సైగ చేయడంతో మోటారు సైకిలు నుంచి సురేష్ చెయ్యి అందించి లేపే ప్రయత్నంలో ఉండగా వెనుక మోటారు సైకిలుపై ఉన్న మరో వ్యక్తి డాక్టర్ జేబులోని సెల్‌ఫోన్‌ను లాఘవంగా చేజిక్కించుకోవడం, పడిపోయిన వ్యక్తి కైతం మోటారు సైకిల్ ఎక్కి పరారవడం క్షణాల్లో జరిగిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

గొల్లప్రోలు: గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని తాటిపర్తి, కొడవలి, వన్నెపూడి గ్రామాల్లో ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాల కోసం ఫలితాలు వచ్చిన తర్వాత ఎవరైనా గ్రామాల్లో తగదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాలాజీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మసీదులో ముగిసిన వేసవి శిబిరం



శిబిరంలోని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న మత పెద్దలు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం మస్జిద్ ఏ అజాంలో మదరసా ఇస్లామియా అహ్మదియా హాస్టల్ ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన మొహిఏ మిల్లత్ దీనీ తాలీమ్ ఔర్ తర్బియతీ వేసవి శిబిరం ఆదివారంతో ముగిసింది. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఇమామ్ హాజరత్ షేక్ గౌస్ మొహియుద్దీన్ పర్యవేక్షణలో జరిగిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో మస్జిద్ ఏ అజాం కమిటీ సభ్యులతో పాటు ప్రముఖ వ్యాపారవేత్త బషీర్ పాల్గొన్నారు. ఈయన సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మొహియుద్దీన్ మాట్లాడుతూ ఈ శిబిరంలో సుమారు 160 మంది విద్యార్థులు పాల్గొని ఇస్లాం మత మూల అంశాలను, వజు, గుసుల్, నమాజ్ చేసే విధానం ఖురాన్, హదీస్‌ల వెలుగులో ఇస్లాం మత నియమాల ప్రకారం జీవించే విధానాన్ని నేర్చుకున్నారన్నారు. 12 రోజుల పాటు ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహదూర్, అత్తహర్ ఖాన్ దుర్రానీ, ఎస్‌కె హుస్సేన్, హాజి మహ్మద్ అన్సరీ, బహదూర్, ముహ్మద్ సాదుల్లా షరీఫ్, హాజీ జహంగీర్, మహ్మద్ అబ్దుల్ హమీద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రేచర్లపేటలోని మస్జిద్ అబుహురైరాలో గత నెలరోజులుగా నిర్వహించిన ఇస్లాం ఆధ్యాత్మిక వేసవి శిబిరం ఆదివారంతో ముగిసింది. రేచర్లపేటలోని ముస్లిం కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో మస్జిద్ ఏ అబుహురైరా ఇమామ్ మౌలానా ఎహెతిషామ్ అధ్యక్షత వహించగా మౌలానా ఆరీఫ్, తాజుద్దీన్, నౌషాద్, వైఎస్సార్ సీపీ నాయకులు అస్గర్, షోఏబుల్లా, సయ్యద్ కరీం పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రఘుపతి వెంకటరత్నం చిరస్మరణీయుడు



బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద రఘుపతి వెంకయ్యకు నివాళులు అర్పిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: విద్యారంగాన్ని దేదీప్యమానం చేసిన నవయుగ వైతాళికుడు రఘుపతి వెంకటరత్నంనాయుడు అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల లోని బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా ఐడీఏ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆధ్యాత్మిక నవజీవనానికి వసుధైక కుటుంబ భావనకు పునాదులు వేసి జీవితాంతం కృషి చేసింది రఘుపతి వెంకటరత్నం నాయుడు అన్నారు. విద్యాలయాలే తపో నిలయాలుగా చేసిన కర్మయోగి అన్నారు. అసోసియేషన్ సభ్యులు చిట్ల కిరణ్ మాట్లాడుతూ రఘుపతి వెంకటరత్నం నాయుడు విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, పవిత్రతకు సంకేతంగా, బ్రహ్మర్షిగా దేశంలోని తెలుగు ప్రాంతాల్లో పేరుపొందిన వ్యక్తి అన్నారు. సంఘ సంస్కరణోద్యమమన్నా, బ్రహ్మ సమాజమన్నా గుర్తుకు వచ్చే పేరు కందుకూరి వీరేశలింగం పంతులుతో పాటు రఘుపతి వెంకటరత్నం నాయుడుదే అన్నారు. పీఆర్ కళాశాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించడమే కాక, వెనుకబడిన వర్గాల, పేద విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, నరసింగ్, ఆదిత్య, ప్రసాద్, కళ్యాణ్ చక్రవర్తి, కాశి పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నానికి ఘనంగా నివాళి

కాకినాడ రూరల్: రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఉన్న వెంకటరత్నం నాయుడు విగ్రహానికి విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, డాక్టరు అడ్డాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఎం.సుబ్బారావు, రెడ్నం రాజా, చంటిబాబు తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘుపతి వెంకటరత్నం నాయుడు గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన బాలికల చదువులను ప్రోత్సహించారన్నారు. 1939 మే 26న ఆయన కాలం చేశారన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

తాళ్లరేవు: వేసవి నేపథ్యంలో తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. క్లబ్ కన్వీనర్ గుత్తుల మల్లేశ్వరరావు నేతృత్వంలో వారం రోజుల పాటు చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాస రచన, నృత్యం, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో టిళ్లపూడి నాగేశ్వరరావు, పబ్బినీడి మణి, మల్లాడి రాంబాబు, వీరన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబు విజయం కోసం తిరుపతికి సైకిల్ యాత్ర



తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టిన దోని శ్రీను, నాగళ్ల సతీష్

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుపై మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు కాకినాడ రూరల్ రమణయ్యపేటకు చెందిన దోని శ్రీను. కన్నబాబు విజయం కోరుతూ గతంలో (2019 ఎన్నికల్లో) తిరుపతి కాలినడకను కాకినాడ నుంచి ఆయన తిరుపతి వెళ్లారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ముగియడంతో జూన్ 4న వెలువడనున్న ఫలితాలు కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలేశుడైన వెంకటేశ్వరుని దయ, కరుణ, కృపా, కటాక్షాలు కన్నబాబుకు ఉండాలని, అఖండ మెజార్టీతో విజయం సాధించి మళ్లీ ఎమ్మెల్యేగా కాకినాడ రూరల్ ప్రజలకు సేవలందించాలని కోరుతూ దోని శ్రీను, మరో అభిమాని నాగళ్ల సతీష్ కలసి తిరపతికి సైకిళ్లపై యాత్ర ప్రారంభించారు. వారిద్దరూ వెంకటేశ్వరస్వామి దీక్షా వస్త్రాలు ధరించి సర్పవరం జంక్షన్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం యాత్ర ప్రారంభించారు. ఆదివారం రాత్రికి ఏలూరులో చేరుకుని అక్కడ బస అనంతరం సోమవారం ఉదయం యాత్ర కొనసాగిస్తామని ఒకటో తేదీన తిరుపతి చేరుకుంటామని వారు దేవరపల్లి నుంచి సాక్షితో మాట్లాడారు. కన్నబాబు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఏకదంత సంకష్టహర చతుర్థి



నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: సంకష్టహర చతుర్థి సృష్టి ఆరంభం నుంచి త్రిమూర్త్యాత్మకంగా కొలిచే ఉపవాస ఉత్సవమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఏకదంత సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఆదివారం సన్నాయి మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన పాలవెల్లి పండ్ల తోరణాలతో సిద్ధి, బుద్ధి గణేశ కలశప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం వేళలో సహస్ర నామార్చన చంద్రహారతి ఏర్పాటు చేశారు. ఉపవాసకులకు పసుపు, కుంకుమ, గాజులు అందించారు.

ఆలయంలో అన్నదానం

తాళ్లరేవు: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘటితమైతే సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కాకినాడ సిటీ: జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం కాకినాడలో అసోసియేషన్ అధ్యక్షుడు బళ్లమూడి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీనియర్ సిటిజెన్ల సమస్యలను చర్చించారు. ప్రతి మండలంలో సీనియర్ సిటిజన్ల సంఘాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వారు ఎదుర్కొనే పలు సమస్యలను పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. సంఘాలు ఏర్పాటుకు ప్రతి సభ్యుడు ప్రయత్నించాలన్నారు. జూన్ 15వ తేదీన సీనియర్ సిటిజన్ల వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లాలో శాశ్వత కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. సంఘ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అధ్యక్షుడు సూర్యనారాయణ వారి సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ల సంఘ నాయకులు ఆర్‌ఎస్ సుధాకర్, వి.శివాజీ, విశ్వేశ్వరరావు, ఎంజీఎం నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, వి.రామసుబ్బారావు, జేఎస్‌వీ ప్రసాద్, ఎం.గోపాలరావు, బొంతు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి

యండమూరి వీరేంద్రనాథ్



ప్లేస్‌మెంట్ డేలో పాల్గొన్న ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్

తాళ్లరేవు: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించొచ్చని ప్రముఖ సినీ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. శనివారం రాత్రి పటవల పైడా గ్రూపు విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డే సెలబ్రేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఇష్టంతో చేసే ఏ పనైనా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. జీవితంలో ఎంత ఉన్నతిని సాధించినా కన్న తల్లిదండ్రులను మాత్రం మరవరాదన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన 362 మంది విద్యార్థులను యండమూరి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు కృష్ణమోహన్, డీన్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ పీవీ సూర్యప్రకాష్, కేశవ్, సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



సుంకరపాలెం జాతీయ రహదారి వద్ద స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం జాతీయ రహదారిలో అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని ఎస్‌ఈబీ అధికారులు ఆదివారం పట్టుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఇసుకాసురులపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఇటీవల హెచ్చరికలు చేసినా అక్రమార్కులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, ఆంధ్రా ప్రాంత సరిహద్దుల్లో రాత్రి వేళల్లో జోరుగా ఇసుక తవ్వకాలు సాగించి సొమ్ములు చేసుకుంటున్నారు. కొందరు కీలక అధికారుల అండతోనే ఇసుక అక్రమ తరలింపు సాగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతుంది.

సరస్వతీ కటాక్షమున్న ధన్యమూర్తి పోచిరాజు



సభలో మాట్లాడుతున్న ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపకుడు వెంకట సత్య నరసింహశాస్త్రి

బోట్‌క్లబ్: కలకాలం పిలిచే చక్కని కవిత్వాన్ని సంతరించిన పోచిరాజు శేషగిరిరావు నన్నయ, శ్రీనాథుడు వంటి ప్రాచీన కవుల గ్రంథాలను తెలుగు సరస్వతికి సమర్పించిన ధన్యమూర్తి అని ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి గొట్టుముక్కల వెంకట సత్య నరసింహశాస్త్రి అన్నారు. ఆదివారం విద్యుత్‌నగర్‌లోని చల్లా కళ్యాణమండపంలో ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి పోచిరాజు శేషగిరిరావు శతజయంతి సందర్భంగా సాహితీ యోగ సమాలోచన సభ జరిగింది. ఈ సందర్భంగా శేషగిరిరావు రచించిన వేద గాలవారం కవితా సంపుటిని సమీక్షిస్తూ ఇది ఆధ్యాత్మిక ఉన్నతిని కలగజేసే కావ్యమని కితాబిచ్చారు. కాకరపర్తి దుర్గాప్రసాద్ కవితా విపంచి కవితా సంపుటిని సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు కవులను సత్కరించారు. కార్యక్రమంలో వెంకట్రావు, మూర్తి, చెరుకువాడ సత్యనారాయణ, జీఎస్ఎస్ఎస్ శ్రీనివాసు, గునుపూడి సావిత్రి కె.గౌరినాయుడు పాల్గొన్నారు.